క్లుప్తంగా

దారి సమస్య పరిశీలన



దారి సమస్యను వివరిస్తున్న నాయకులు

పూతలపట్టు: మండల కేంద్రం నుంచి కలికిరి కొండకు వెళ్లే దారి సమస్యను గురువారం డీఎఫ్ఓ చైతన్యకుమార్‌రెడ్డి పరిశీలించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు గోపాలరెడ్డి స్థానిక సమస్యను డీఎఫ్ఓకు వివరించారు. దారి సమస్య పరిష్కారంతోపాటు చెక్‌డ్యాం, మొక్కలు నాటడం తదితర పనులను త్వరలో చేపడతామని ఆయన పేర్కొన్నారు. అనంతరం అనంతాపురంలోని వనసంరక్షణ సమితిని పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ మాసిల్లా మణి, నాయకులు తేజేశ్వర్‌రెడ్డి, దయశంకర్ రెడ్డి, ప్రత్యూష్ తదితరులు పాల్గొన్నారు.

సత్తా చాటిన విద్యార్థినికి అభినందనలు



మండల టాపర్ నందినిని అభినందిస్తున్న ఆశ్రమ నిర్వాహకులు, సభ్యులు

బంగారుపాళెం: మండలంలోని మంగళపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని నందిని గురువారం బ్రహ్మర్షి పత్రిజీ పిరమిడ్ ఆశ్రమ నిర్వాహకులు అభినందించారు. పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో నందిని మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించింది. పిరమిడ్ మాస్టర్లు లలిత, నాగరాజు, రోహిణి తదితరులు నందినిని అభినందించారు.

స్పందన అర్జీలకు సత్వర పరిష్కారం

తవణంపల్లె: స్పందనకు వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించాలని డిప్యూటీ తహసీల్దార్ నరేష్ తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో డి.టి నరేష్ మాట్లాడుతూ స్పందనలో వచ్చే అర్జీలను వీఆర్‌ఓలు ఆలస్యం చేయకుండా ఎప్పటికప్పుడు విచారించి పరిష్కరించాలని సూచించారు. 18 ఏళ్లు నిండిన వారిని ఓటరు నమోదు చేయించాలన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వచ్చిన క్లెయిమ్‌లను వెంటనే పరిశీలించి పరిష్కరించాలని చెప్పారు. మండలంలో హౌసింగ్ స్థలాలకు సంబంధించిన అర్జీలను వెంటనే పరిష్కరించి ప్లాట్లు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో భూరీసర్వే డీటీ వెంకటరమణ పాల్గొన్నారు.

హెల్త్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలి

చిత్తూరు అర్బన్: న్యాయవాదుల కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన హెల్త్ కార్డులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర న్యాయవాద మండలి సభ్యులు నల్లారి ద్వారా రెడ్డి ప్రకటనలో కోరారు. రూ.2 లక్షల హెల్త్ కవరేజ్ కోసం రూ.3 వేలు, రూ.3 లక్షల కవరేజ్ కోసం రూ.4,700 చెల్లించాల్సి ఉంటుందన్నారు. 70ఏళ్ల లోపు వయసున్న న్యాయవాదులు మాత్రమే ఈ పాలసీ తీసుకోవడానికి అర్హులని చెప్పారు. ఈనెల 11వ తేదీ లోపు ప్రీమియం చెల్లించాలని తెలిపారు. వివరాలకు బార్ అసోసియేషన్ కార్యాలయాల్లో సంప్రదించాలని కోరారు.

టెండర్ల ఆహ్వానం

బంగారుపాళెం: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో క్యాంటీన్ నిర్వహణ, చెత్త తొలగింపునకు టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ నారే సోమశేఖర్, కార్యదర్శి వెంకటరమణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పూర్తి చేసిన టెండర్లను ఈ నెల 16వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు మార్కెట్ కమిటీ కార్యాలయంలో సమర్పించాలని కోరారు. క్యాంటిన్, చెత్త నిర్వహణకు సంబంధించి వేర్వేరుగా డిమాండ్ డ్రాఫ్టులను కార్యదర్శి, వ్యవసాయ మార్కెట్ కమిటీ, బంగారుపాళెం పేరు మీద చెల్లించాలని తెలిపారు. వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఏర్పాట్లు ముమ్మరం

గుడిపాల: మండలంలోని వసంతాపురంలో ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో ఈ ఏడాది మహాభారత ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఆలయ అభివృద్ధి కమిటీ ఏర్పా ట్లు ముమ్మరం చేసింది. ఈ ఉత్సవాలకు 34 ఏళ్లు పూర్తయ్యాయని, ఇప్పుడు 35వ మహాభా రతం నిర్వహించనున్నట్లు తెలిపారు. మే 14వ తేదీ నుంచి 31వ తేదీ వరకు మహాభారతం ఉంటుందని కమిటీ మెంబర్లు చెప్పారు. భాగవతారిణి నాగరత్న 18 రోజులపాటు మహాభారత యజ్ఞం హరికథలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మే 21వ తేదీ నుంచి శ్రీ కృష్ణార్జున కళానాట్యమండలి తిరుపతి మునిశంకర్, గుణశేఖర్ వారిచే నాటకం ప్రదర్శించనున్నారు.

నేడు పొంగళ్లు

చిత్తూరు రూరల్: నగరంలో ఈ నెల 16,17 తేదీల్లో నిర్వహించనున్న నడివీధి గంగజాతరను పురస్కరించుకుని శుక్రవారం ప్రజలు పొంగళ్లు పెట్టనున్నారు. ప్రధానంగా పొన్నియమ్మ ఆలయం, దుర్గమ్మ ఆలయం, శక్తిమారియమ్మ ఆలయం, ముత్యాలమ్మ ఆలయం వద్ద పొంగళ్లు పెట్టేందుకు వీలుగా ఏర్పాట్లు పూర్తి చేశారు.

తల్లుల ఇంటికే సంపూర్ణ పోషణ

- జూలై నుంచి అమలు చేయాలని ఉత్తర్వులు
- ఇది వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లోనే మధ్యాహ్న భోజనం
- పౌష్టికాహార అమలుపై ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం సర్వే



అంగన్‌వాడీ కేంద్రంలో పోషక ఆహారం స్వీకరిస్తున్న తల్లులు (ఫైల్)

చిత్తూరు రూరల్: అంగన్‌వాడీ కేంద్ర సేవలను రాష్ట్ర ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోంది. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల సంపూర్ణ ఆరోగ్యం కోసం పౌష్టికాహారం అందిస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో నిత్యం పప్పు, కూరగాయలు, ఆకుకూరలతో మధ్యాహ్న భోజనాన్ని వడ్డిస్తోంది. ఈ విధానంలో లబ్ధిదారుల అసంతృప్తి వ్యక్తమవ్వడంతో ఇటీవల సర్వే చేపట్టింది. జూలై నుంచి ఇంటికే వైఎస్సార్ సంపూర్ణ పోషణ సరుకులు ఇవ్వాలని తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది.

చిత్తూరు రూరల్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 299 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో కేంద్రానికి వచ్చే పిల్లలు 4,216 మంది, 7 నెలల నుంచి 3 ఏళ్ల పిల్లలు 7,995 మంది ఉన్నారు. గర్భిణులు 1,718 మంది, బాలింతలు 1,638 మంది లబ్ధిపొందుతున్నారు. వీరికంతా ప్రతి నెలా రాష్ట్ర ప్రభుత్వం మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం, 200 ఎం.ఎల్ పాలు, ఉడికించిన గుడ్డు ఇస్తున్నారు. అది కూడా అంగన్‌వాడీ కేంద్రాల్లోనే తినాల్సి ఉంది. 7 నెలల నుంచి మూడేళ్లలోపు పిల్లలకు మాత్రం ఇంటికే సరుకులు ఇస్తున్నారు. అయితే ఈ వైఎస్సార్ సంపూర్ణ పోషణను పక్కాగా లబ్ధిదారులకు చేరేలా ప్రభుత్వం ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటోంది.

సర్వేలో ఇలా...

అంగన్‌వాడీ నిర్వహణ, సేవల అమలు తీరుపై రాష్ట్ర ప్రభుత్వం నిఘా పెడుతోంది. అంగన్‌వాడీ అధికారులు, సూపర్‌వైజర్లు పర్యవేక్షించడంతోపాటు మహిళా పోలీసులకు బాధ్యతలు అప్పగించింది. వీరు నిత్యం అక్కడ జరిగే కార్యకలాపాలతోపాటు సేవల అమలుతీరును పర్యవేక్షిస్తూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతుంటారు. అయినా కొంత మంది సరుకులు నొక్కేస్తుంటారనే ఆరోపణలు ఉన్నాయి. ఇక చాలా మంది మధ్యాహ్నం భోజనం కోసం అంగన్‌వాడీ కేంద్రాల వైపు రావడంలేదు. ఇంకొంతమంది మధ్యాహ్న భోజనం ఇంటికి తీసుకెళుతుంటారు. అసలు కొన్ని కేంద్రాలకు పిల్లలు, లబ్ధిదారులు రాకపోయినా వచ్చినట్లు చూపించి సరుకులను పక్కదారి పట్టిస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఇలాంటి వాటిపై అధికారులకు ఫిర్యాదులు ఎప్పటికప్పుడు వెళుతున్నాయి. ఇటీవల రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ ఆకస్మిక తనిఖీలో ఇలాంటి బాగోతాలు చాలానే బయటపడ్డాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఫిబ్రవరి నుంచి మార్చి నెల వరకు సర్వే చేపట్టింది. బువ్వతింటారా..సరుకులు ఇవ్వమంటారా అంటూ కేంద్రాలకు వెళ్లి, ఫోన్ ద్వారా సర్వే చేయించారు. ఈ సర్వేలో అధికశాతం మంది ఇంటికే సరుకులు ఇవ్వాలని చెప్పుకొచ్చారు. అలాగే పక్కదారి పనులను పూసగుచ్చినట్లు వివరించారు. సర్వే నివేదికల ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన అమలు విషయంలో తాజాగా మార్పులు చేసింది.

జూలై నుంచే అమలు

తాజా మార్పుల కారణంగా ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణ పథకం కింద గర్భిణులు, బాలింతలకు జూలై నుంచి ఇంటికే సరుకులు ఇచ్చేలా నిర్ణయం తీసుకుంటూ ఉత్తర్వులు జారీ చేసింది. అధికారులకు రాష్ట్ర శాఖ అధికారులు ఇప్పటికే పలు సూచనలు, సలహాలు చేశారు. గర్భిణులు, బాలింతలకు సరుకులు అందించే విషయంలో చేతివాటం వద్దని పదేపదే హెచ్చరించారు. ఇకపై అలాంటివి జరిగితే కఠిన చర్యలతోపాటు కేసులు నమోదు చేస్తామని సూచించించారు.

సరుకుల పంపిణీ ఇలా..

వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో భాగంగా జూన్ వరకు అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి మధ్యాహ్న భోజనం చేయాల్సి ఉంది. జూలై నుంచి ప్రతి నెలా గర్భిణులు, బాలింతలకు బియ్యం 3 కేజీలు, పప్పు కేజీ, పామాయిల్ 500 మి.లీ, గుడ్లు 25, పాలు 2.5 లీటర్లు, రాగి పిండి 2 కేజీలు, అటుకులు కేజీ, బెల్లం 250 గ్రాములు, చిక్కీ 250 గ్రాములు, ఖర్జూరం 250 గ్రాములు చొప్పున ఇంటికే సరుకులు ఇచ్చి పంపనున్నారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను ఈ నెల 9వ తేదీ జారీ చేసింది.

ఆరోగ్యానికి భరోసా



గర్భిణులు, బాలింతల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం భరోసా కల్పిస్తోంది. ప్రధానంగా మాతా శిశు మరణాలను తగ్గించాలనే ప్రయత్నంలో భాగమే వైఎస్సార్ సంపూర్ణ పోషణ. ఈ పథకం ద్వారా తల్లులకు అంగన్‌వాడీ కేంద్రం ద్వారానే మధ్యాహ్న భోజనం వడ్డించేవారు. ఇటీవల చేసిన సర్వేతో తల్లులకు జూలై నుంచి ఇంటికే ఇవ్వాలని ఉత్తర్వులు వచ్చింది. ఈ మేరకు తాము పకడ్బందీగా సరుకుల పంపిణీ చేపడుతాం.

-శ్యామ్ సుగుణకుమారి, సీడీపీఓ, చిత్తూరు

నిరంతరం ప్రజల్లో ఉండే నాయకుడు పెద్దిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

సదుం: నిరంతరం ప్రజల్లో, ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇచ్చే నాయకుడిగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నిలిచిపోతారని చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన గృహ సారథులు, వలంటీర్లు, అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో గత ఎన్నికల్లో 14 నియోజకవర్గాల్లో 13 చోట్ల గెలిపించడంలో ఆయన ప్రధాన పాత్ర వహించారని తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఏబాధ్యత అప్పగించినా దాన్ని విజయవంతంగా నెరవేరుస్తున్నారని చెప్పారు. గ్రామ గ్రామాన ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉంటూ, వారి సమస్యలను పరిష్కరించేందుకు సొంత నిధులను సైతం వెచ్చించిన ఘనత ఆయనకే దక్కుతుందని తెలిపారు. నియోజకవర్గ ప్రజల ఆశీస్సులు ఆయనకు ఎప్పుడూ ఉండాలని కోరారు.

మండల ప్రజల రుణం తీర్చుకోలేనిది

సదుం మండల ప్రజల రుణం తీర్చుకోలేనిదని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి తెలిపారు. తమ కుటుంబంలో పలు పదవులు దక్కేందుకు వారి అభిమానమే కారణమన్నారు. ఎంతటి కష్ట కాలంలోనైనా తమ వెన్నంటే ఉన్నారని చెప్పారు. ఎన్నికల సమయంలోను తంబళ్లపల్లెకు వచ్చి తమకు మద్దతుగా ప్రచారం నిర్వహించారని గుర్తు చేసుకున్నారు.

'కార్యదర్శుల కాలక్షేపం'పై కలెక్టర్ ఆరా

సాక్షి ఎఫెక్ట్..

యాదమరి: పంచాయతీ కార్యదర్శుల నిర్లక్ష్యంపై సాక్షి దినపత్రికలో గురువారం 'కార్యదర్శుల కాలక్షేపం' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే డబుల్ క్యాష్‌బుక్‌ల నిర్వహణ, ఏయే డీడీఓల చేతిలో క్యాష్‌బుక్‌లున్నాయంటూ ఆరా తీశారు. వెంటనే వాటి వివరాలు ఇవ్వాలని ఆయన జిల్లా అధికారులకు ఆదేశించారు. ఈ మేరకు జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి సందిస్తూ కార్యదర్శుల పనితీరుపై మండిపడ్డారు. క్యాష్‌బుక్‌ల నిర్వహణ వివరాలను వీలైనంత త్వరగా ఇవ్వాలని మండల అధికారులను ఆదేశించారు. క్యాష్‌బుక్ నిర్వహణ, జమ ఖర్చుల ఆన్‌లైన్ వివరాలు తదితర వివరాలను క్షుణంగా ఎప్పటికప్పుడు పరిశీలన చేయాలన్నారు. విధుల్లో అలసత్వం వహించే వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇతరత్రా పనుల పేరుతో విధులకు ఎందుకు డుమ్మా కొడుతున్నారని ప్రశ్నల వర్షం కురిపించారు. అధికారిక సమావేశాలు, కార్యక్రమాలు తప్ప మిగిలిన వేళల్లో కచ్చితంగా సచివాలయ, పంచాయతీ పరిధి లో ఉండాలని స్పష్టం చేశారు. విధులు, భాధ్యతలను సక్రమంగా నిర్వర్తించేలా చూడాలని ఆదేశించారు. గ్రామాల్లో పర్యటించి సమస్యలను పరిష్కరించేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఫిర్యాదులు వస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని ఆయన పేర్కొ న్నారు. అసలు క్యాష్ బుక్‌ల గోల్‌మోల్‌పై ఆయన ప్రత్యేకంగా అధికారుల నుంచి వివరాలు సేకరించారు. ఇలాంటి అక్రమాలు చేసే కార్యదర్శులు ఎంత మంది ఉన్నారు. ఎన్ని రోజుల నుంచి ఇలాంటి పనులు చేస్తున్నారు. అసలు విధుల్లో వారి చరిత్ర ఏంటో కూడా వెలికి తీయాలని ఆయన స్పష్టంగా ఆదేశించినట్లు సమాచారం. ఈ విషయం ఇప్పటికే సంబంధిత కార్యదర్శులకు చేరడంతో గుబులు పట్టుకుంది. ఎక్కడ వేటు పడుతుందో అని తప్పించుకునే మార్గాలు వెదుకుతున్నారు. మరికొందరు దీర్ఘకాల సెలవుపై వెళ్లే యోచనలో ఉన్నట్లు తెలిసింది.

విద్యుత్ ఉద్యోగుల సర్వీసును క్రమబద్ధీకరించాలి



మాట్లాడుతున్న నాయకులు హేమకుమార్

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ కాంట్రాక్ట్ ఉద్యోగుల సర్వీసును క్రమబద్ధీకరించాలని ఆ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక విద్యుత్‌శాఖ అతిథి గృహంలో కాంట్రాక్ట్ ఉద్యోగులు సమావేశమయ్యారు. నాయకులు మాట్లాడుతూ, తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 26 వేల మంది, ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 2వేల మంది కాంట్రాక్ట్ ఉద్యోగులున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం నాయకులు రూప్‌కుమార్, హేమకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సిగ్నల్స్ పనితీరు పరిశీలన



సిగ్నల్ లైట్లను పరిశీలిస్తున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: నగరంలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు, ట్రాఫిక్ సిగ్నల్స్ పనితీరును నగర కమిషనర్ జె అరుణ గురువారం రాత్రి పరిశీలించారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నగరంలో గాంధీ విగ్రహ కూడలిలో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేశారు. దీంతోపాటు ట్రాఫిక్ నియంత్రణ, క్రమబద్ధీకరణ కోసం గాంధీ కూడలిలోని పలుమార్గాల్లో, ఎమ్మెస్సార్, దర్గా కూడలిలో నూతనంగా ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ సిగ్నల్స్ పనితీరును కమిషనర్ అరుణ, చిత్తూరు డీఎస్పీ శ్రీనివాస మూర్తి, ట్రాఫిక్ పోలీసులతో కలిసి పరిశీలించారు. ట్రాఫిక్ సిగ్నల్స్ ఏ మార్గంలో ఎంత సమయం నిర్వహిస్తే ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దర్గా కూడలిలోనూ హైమాస్ట్ లైట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని నగరపాలక ఇంజనీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. నగరంలో నిర్ణయించిన ప్రాంతాల్లో ట్రాఫిక్ స్థిరీకరణ కోసం చేపడుతున్న పనులు వేగంగా పూర్తి చేయించాలన్నారు. కార్యక్రమంలో డీఈలు వెంకట ప్రసాద్, రమణ, ఏఈలు పాల్గొన్నారు.

ఉద్యోగ అవకాశాలపై అవగాహన



పోటీల్లో గెలుపొందిన కేడెట్‌ను అభినందిస్తున్న కల్నల్ అజయ్ బస్‌నెట్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని కృష్ణవేణి జూనియర్ కళాశాలల ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఎన్‌సీసీ క్యాంప్‌లో విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. గురువారం నిర్వహించిన ఈ సదస్సులో కల్నల్ అజయ్ బస్‌నెట్ మాట్లాడుతూ 35 ఆంధ్ర బెటాలియన్ క్యాంపు నిర్వహించి విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగ అవకాశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు చెప్పారు. ఎన్‌సీసీ–సీ సర్టిఫికెట్ పొందిన కేడెట్లకు ఎస్ఎస్‌బీలో ఆర్మీ అధికారులు అయ్యే అవకాశాలపై సూచనలు ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం కేడెట్లకు పలు క్రీడా పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరచిన వారికి బహుమతులు, సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు ప్రసాద్‌రెడ్డి, రమేష్, నవీన్ పాల్గొన్నారు.

వేసవి శిక్షణా శిబిరం పరిశీలన



విద్యార్థులు వేసిన బొమ్మలను తిలకిస్తున్న డీవైఈవో

చిత్తూరు కలెక్టరేట్ : నగరంలోని తపోవనం పాఠశాలలో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణా శిబిరాన్ని డీవైఈవో చంద్రశేఖర్ గురువారం పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులకు విజ్ఞానాన్ని అందించేందుకు శిక్షణ శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చిత్రలేఖనం, రంగులు వేయడం, పేపర్ కట్టింగ్‌లను బాపు బాలభవన్ శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా నేర్పిస్తున్నట్లు చెప్పారు. నగరంలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు వేసిన బొమ్మలను డీవైఈవో పరిశీలించి అభినందించారు. ఈ కార్యక్రమంలో బాపు బాలభవన్ సూపరింటెండెంట్ రామచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిబిరానికి స్పందన

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో బాలబాలికలకు ఉచితంగా అందిస్తున్న వేసవి శిక్షణా శిబిరానికి స్పందన లభిస్తోంది. యోగా, కథలు చెప్పడం, స్పోకెన్ ఇంగ్లిష్, చెస్ అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి లావణ్య, ఉపగ్రంథాలయాధికారి గజేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలను అరికట్టాలి





తిమ్మోజుపల్లె గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న ఎస్ఈ దేవానందన్, తవణంపల్లె: సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి

పూతలపట్టు: బాల్యవివాహాలను అరికట్టాలని ఎస్‌బీసీసీ కో–ఆర్డినేటర్ గాంధీరెడ్డి అన్నారు. మండలంలోని పి.కొత్తకోట సచివాలయాన్ని గురువారం ఆయన సందర్శించారు. అక్కడి సిబ్బంది, వలంటీర్లతో ఆయన మాట్లాడుతూ న్యూట్రిషియన్ ఫుడ్, వైఎస్సార్ పోషణ, బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు. మ్యారేజ్ సర్టిఫికెట్లను తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. అనంతరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను సందర్శించారు. గర్భిణులు, బాలింతలతో మాట్లాడారు. రక్తహీనతతో బాధపడే వారికి మాత్రలు అందించారు.

తిమ్మోజుపల్లెలో..

బంగారుపాళెం: మండలంలోని తిమ్మోజుపల్లె గ్రామ సచివాలయాన్ని గురువారం సాయంత్రం ఆర్‌అండ్‌బి ఎస్ఈ దేవానందన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించిన లబ్ధిదారుల చార్టుల వివరాలను కార్యదర్శి నూర్‌మహ్మద్‌ను అడిగి తెలుసుకున్నారు. అర్హులైన పేదలకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సకాలంలో అందించాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ సేవలను అందించడంలో నిర్లక్ష్యం వహించరాదన్నారు.

టి.పుత్తూరులో..

తవణంపల్లె: మండలంలోని టి.పుత్తూరు సచివాలయాన్ని గురువారం ఎంపీడీఓ ఎం.హరిప్రసాద్ రెడ్డి తనిఖీ చేశారు. సచివాలయంలో రికార్డులను పరిశీలించారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని ఆదేశించారు. ఉపాధి పనులు చేసే కూలీలతో మాట్లాడారు. కూలీల సంఖ్య పెంచాలని సూచించారు. వడదెబ్బకు గురికాకుండా ఉదయం, సాయంత్రం వేళల్లో పనులు చేయాలని తెలిపారు. ఎంపీడీఓతోపాటు ఏపీఓ లలిత, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో మెరుగైన వైద్య సేవలు





కుప్పిగానిపల్లెలో సేవలందిస్తున్న డాక్టర్ రక్షిత, బోడబండ్లలో దివ్యాంగుడిని పరీక్షిస్తున్న ఆరోగ్య సిబ్బంది

బంగారుపాళెం: గ్రామీణ ప్రజలకు ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్ అన్నారు. మండలంలోని బోడబండ్ల గ్రామంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వేసవిలో ప్రజలు వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. గ్రామీణ పేద ప్రజల కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన ఫ్యామిలీ డాక్టర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ భగవద్గీత, ఎంఎల్‌పీహెచ్‌లు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యసేవలను వినియోగించుకోండి

గుడిపాల: వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ రష్మిత అన్నారు. కుప్పిగానిపల్లెలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లోనే ఉచితంగా వైద్యసేవలను అందించనున్నట్లు చెప్పారు. షుగర్, బీపీ రోగులకు రక్తపరీక్షలు నిర్వహించి నెలకు సరిపడే మాత్రలను ఉచితంగా అందజేశారు. మంచాన పడిన రోగులకు ఇంటివద్దే వెళ్లి వైద్యం అందించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది శిల్ప, శివగామి, కిరణ్‌కుమారి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆదరించండి



పీ.రెడ్డివారిపల్లెలో సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

ఐరాల: అర్హతే ప్రామాణికంగా పథకాలు అందిస్తున్న సంక్షేమ ప్రభుత్వాన్ని మరింత ఆదరించాలని ఎమ్మెల్యే ఎంఎస్ బాబు కోరారు. మండలంలోని పొలకల–1 సచివాలయ పరిధిలోని గ్రామాల్లో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఉదయం నుంచి తాళంబేడువారిపల్లె, నరసింగాపురం, రెడ్డివారిపల్లె బీసీ కాలనీ, రెడ్డివారిపల్లె, ఎస్టీ కాలనీ, దళితవాడ, చల్లావారిపల్లెలో ఆయన 470 కుటుంబాలను కలిశారు. ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లలో ప్రభుత్వ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. సంక్షేమ బావుటా బుక్‌లెట్‌లను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో ఏ గడపకు వెళ్లినా ప్రజల ముఖాల్లో సంతోషం కనిపిస్తోందన్నారు. నవరత్నాల పథకాలతో అర్హులందరికీ లబ్ధి చేకూరిందని చెప్పారు. అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు అందని వారి వివరాలను నమోదు చేసుకుని పథకాలు అందేలా చూడాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతుండడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. మురుగు కాలువలు నిర్మించాలని, సీసీ రోడ్లు వేయాలని, ఇంటి పట్టాలు మంజూరు చేయాలని, కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటుచేయాలని, పీ.రెడ్డివారిపల్లె ప్రాథమిక పాఠశాల మరమ్మతులు చేయాలని హెచ్‌ఎం శ్రీనివాసులు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. ఎస్టీ కాలనీ వాసులు మరుగుదొడ్లు నిర్మించాలని నివేదించారు. ఎమ్మెల్యే నిధుల నుంచి రూ.2 లక్షలతో పాఠశాల మరమ్మతు పనులు ప్రారంభించాలని పీఆర్ ఏఈ ప్రసాద్‌ను ఆదేశించారు. ఎస్టీ కాలనీలో మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలను సిద్ధం చేయాలని ఎంపీడీఓను ఆదేశించారు.

సచివాలయంలోనే పరిష్కారం

గ్రామస్థాయిలో నెలకొన్న సమస్యలను సచివాలయాల పరిధిలోనే పరిష్కరించాలని ఎమ్మెల్యే సూచించారు. పొలకల–1లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. రెండు రోజుల పాటు నిర్వహించిన గడప గడపకు కార్యక్రమంలో వచ్చిన అర్జీలపై అలసత్వం ప్రదర్శించొద్దని ఆదేశించారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందకపోతే అందుకు గల కారణాలను వెంటనే తెలియజేయాలన్నారు. అంకితభావంతో సేవలందించాలని సూచించారు. మండలంలోని పొలకల–2 సచివాలయ పరిధిలో శుక్రవారం ఉదయం నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నిర్మలాదేవి తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ బుజ్జిరెడ్డి, ఎంపీపీ మోహన్, సర్పంచులు వసంత, శాంతిసాగర్‌రెడ్డి, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు దేవేంద్రరెడ్డి, ఎంపీటీసీ సాగర్‌రెడ్డి, తహసీల్దార్ సుశీలమ్మ, ఎంపీడీఓ నిర్మలాదేవి పాల్గొన్నారు.,